
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





# కర్షక వ్యతిరేకి కాంగ్రెస్‌ను తరుముడే..

**రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి** 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తుంటే కాంగ్రెస్ తట్టుకోలేకపోతున్నది. రైతులు సంతోషంగా వ్యవసాయం చేస్తూ ఆనందంగా ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నది. సాగుకు 3 గంటల కరెంట్ చాలని, రైతులు 10హెచ్‌పీ మోటర్లు వాడాలని ఉచిత సలహాలు ఇస్తున్నది. కాంగ్రెస్ అర్థం లేని మాటలపై రైతులు మండిపడుతున్నారు. అన్నదాతను ఆగం చేయడమే లక్ష్యంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల్లో షాక్ ఇస్తామని హెచ్చరిస్తున్నారు. సమైక్య పాలనలో భూ రికార్డుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది. భూమి అనుభవదారు ఒకరుంటే, రికార్డుల్లో పట్టాదారు మరొకరు, కబ్జాదారు ఇంకొకరు ఉండేవారు. ఫలితంగా నిత్యం పోలీస్‌స్టేషన్లలో కేసులు, కోర్టుల్లో దావాలు వేసే పరిస్థితి. అలాంటి పరిస్థితిని స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా తాసిల్దార్‌కు రెవెన్యూ అధికారాలు అప్పగించి పది నిమిషాల్లోనే భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఈ పోర్టల్‌తో నేడు భూ సమస్యలన్నీ పరిష్కారమవడమే కాకుండా లెక్కలన్నీ రికార్డుల్లో భద్రంగా ఉన్నాయి.

*– సంగారెడ్డి, జిల్లా నెట్‌వర్క్, నవంబర్ 27*

## మూడు గంటలు వద్దు.. 24గంటల కరెంటే ముద్దు

సిర్గాపూర్, నవంబర్ 27: సీఎం కేసీఆర్ ఇస్తున్న 24గంటల కరెంటే మాకు అవసరం. ఎవరెన్ని మాయమాటలు చెప్పినా వినేది లేదు. ఇప్పుడున్న కరెంట్‌తో ఎలాంటి సమస్యలు లేవు. పంటలకు నీరుపెట్టుకొని పంటలు పండించుకుంటున్నం. అదిగాక ప్రతి ఏటా రైతుబంధు పంట పెట్టుబడులకు అందుతున్నది. ఎవరైన రైతు చస్తే వారి ఇంటికి రూ. 5లక్షల రైతుబీమా ఇస్తున్నరు. ఎరువులు, విత్తనాలు, మందులు అన్నీ అందుబాటులో ఉన్నయ్. ఇంతజేస్తున్న కేసీఆర్ సార్‌కు విడిచి వేరే పార్టీకి ఓటెలా ఏస్తం. రైతులందరికీ అన్నివిధాలా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు. ఏం తక్కువ లేదు. అయితే మూడు గంటలు కరెంట్‌తో వ్యవసాయం సాగు కాదు. అంతేగాక 10 హెచ్‌పీ మోటారు తెచ్చి పెట్టుకునే అవసరం కూడా రైతులకు లేదు. తప్పుడు మాటలు చెప్పి రైతుల నెత్తి కరాబ్ చేస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలి.

*– సర్దార్ నాయక్, రైతు, హుమ్లానాయక్ తండా, సిర్గాపూర్ మండలం*



## 24గంటల కరెంటుతోనే పంటలు బాగా పండుతున్నయి



ఎవుసానికి తెలంగాణ సర్కారు ఇస్తున్న 24గంటల కరెంటుతో పంటలకు ఏ ఢోకా లేదు. దిగుబడి కూడా మంచిగొస్తుంది. ఉన్న కరెంటును తగ్గించి మూడు, ఐదు గంటల కరెంటు ఇస్తే ఎట్లా పంటలు పండిస్తం. బోర్లకు 10హెచ్‌పీ మోటార్లు మళ్ల ఎవరు పెట్టుకుంటరు. ఉన్న బోరు మోటరు పక్కకు పడేయాల్నా. కరెంటు వచ్చే టైం కోసం చూసి మళ్ల చేన్ల కాడికి ఉరుకుడు మళ్ల మొదలైతదా. ఈ బాధలంతా దేనికి. కేసీఆర్ సర్కారు ఇస్తున్న కరెంటు మంచిగుండగా మూడు, ఐదు గంటల కరెంటు ఇచ్చొటోళ్లకు ఓట్లు ఏసుడేందుకు. పాత కష్టాలు కొని తెచ్చుకనుడు ఎందుకు.

*– గంగు లక్ష్మయ్య, దాదిగూడెం గ్రామం, జిన్నారం మండలం*

## కరెంటు కష్టాలు పోయాయి



పదేండ్లుగా కరెంటు మోటార్లు కాలిపోవడం అనే మాటలే వినబడడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం లేదు. రైతులకు ఉన్న సమస్యలన్నీ తొలిగిపోయాయి. కరెంటు నిరంతరాయంగా ఉండడంతో నీళ్లు పుష్కలంగా ఉండి పంటలు బాగా పండిస్తున్నాం. మా ఆదాయం బాగా పెరిగింది. మా కుటుంబం పిల్లలతో సహా సంతోషంగా ఉన్నాం. మా ప్రాంతంలో కాలుష్యం బాగా ఉండేది. వర్షాలు ఎక్కువ పడడంతో కాలుష్యం సమస్య సైతం తగ్గిపోయింది. కాంగ్రెసోళ్లు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు. వాళ్లకు ఎవుసం ఏం తెల్వదు. వాళ్లన మాటలు నమ్మె పరిస్థితిలో రైతులు లేరు. మళ్లీ సీఎం కేసీఆరే ముఖ్యమంత్రి. ఆయనే రైతుల పాలిత దేవుడు.

*– శ్రీకాంత్, దయారా, అమీన్‌పూర్ మండలం*

## 10 హెచ్‌పీ మోటర్లను కొనుక్కోవాలా..



వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతుందని రేవంత్‌రెడ్డి అనడం సిగ్గుచేటు. లక్షలు ఖర్చు పెట్టి టెన్ హెచ్‌పీ మోటార్లు కొనే స్థోమత రైతుల వద్ద లేదు. కేసీఆర్ సీఎం అయిన తర్వాత కరెంటు సరిపోవడం లేదు అనే మాటే లేదు. ఏ ఒక్క రైతు మోటార్ కాలిపోయిందని, చేను కాడా పంట ఎండిందని అన్న రైతే లేడు. ఓట్ల కోసం మూడు గంటల కరెంటు, టెన్ హెచ్‌పీ మోటర్లు అంటూ రైతులను మోసం చేసేందుకు తయారయ్యారు.

*– గోపాల్, రైతు, గొటిగార్‌పల్లి, కోహీర్ మండలం*

## కౌలు రైతుకు రైతుబంధు ఇస్తామనడం న్యాయమా..



రైతుబంధు ఇచ్చినట్లే కౌలు రైతుకు కూడా రైతుబంధు ఇస్తమంటివి. మళ్లీ గీ తిరకాసు ఏమిటి రేవంత్‌రెడ్డి.. రైతులను కడుపులో పెట్టుకుని చూసుకుంటాంటివి. గిదేమి లెక్కా. సాతగాని మాటలు ఎందుకు చెప్పి రైతులను నమ్మిస్తవు. నీకు సీఎం అయ్యే స్థాయే కాదు. ముందుగళ్ల కొడంగల్‌లో గెలువు. మీ నియోజకవర్గంలో ఉన్న రైతులు నిన్ను ఓడించడం ఖాయం. ఆరు గ్యారంటీలంటివి. అందులో ఒక గ్యారంటికి ఇప్పుడే మాటమార్చితివి. ఇక గెలిస్తే ఇంకేన్నీ మాటలు మార్చి మా బతుకులతో ఆడుకుంటవ్, రాష్ట్రంలో రైతులందరూ కాంగ్రెస్ లీడర్లకు బుద్ధిచెప్పే రోజులు వచ్చినయ్. నోటికొచ్చినట్లు చెప్పి మా రైతులతో ఎందుకు ఆడుకుంటవ్, నీ బతుకుకు నీవు సీఎం అయితవా? మొఖం అద్దంలో చూసుకో జర. మా రాష్ట్రానికి సీఎం కావాలంటే మా జనాన్ని గుండెల్లో పెట్టుకుని అన్నలా, పెద్దకొడుకుగా చూసుకునేది సీఎం కేసీఆరే. ఇక చాలు నీ పసంగం. మళ్లీ తెలంగాణ ప్రజలు సీఎం కేసీఆర్‌ని గెలిపించడం ఖాయం.

*–దామోదర్‌రెడ్డి, రైతు, రాంరెడ్డిబావి, గుమ్మడిదల మండలం*

## కాంగ్రెసోళ్లను నమ్మితే రైతుల పరిస్థితి ఆగమే

సీఎం కేసీఆర్ సర్కారు రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇస్తున్నది. ఎప్పుడు తడిలేకపోతే అప్పుడు నీళ్లు పారించుకోవచ్చు. మోటర్లు కాలిపోవడం లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 3 గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలంటున్నరు. 10 హెచ్‌పీ మోటర్లు బోరుబావుల నుంచి 10నిమిషాల్లోనే నీళ్లు తోడేస్తాయి. రైతులు మర్చిపోతే అది కాలి కావాల్సిందే. అప్పుడు బాధ పడాల్సింది రైతులే. గతంలో కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోసం ఎంత నరకయాతన పడ్డామో ఇంకా మర్చిపోలేదు. కరెంట్ ఎప్పుడు వస్తోందో తెలిసేది కాదు. రాత్రి పూట పొలాలకు నీళ్లు పెట్టేందుకు పోతుంటే పాములు, తేళ్లు కుట్టి చాలామంది చనిపోయారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు పచ్చి అబద్ధాలు. పక్కనే ఉన్న కర్ణాటకలో వాళ్ల మాటలు నమ్మి రైతులు మోసపోతున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే మంచిగున్న బతుకులను ఆగం చేసుకోవాల్సిందే. రైతుల బాగుకోరే వ్యక్తి సీఎం కేసీఆర్ సారు ఒక్కరే. రైతులందరూ ఆయనకు అండగా ఉండి మళ్లీ గెలిపించుకుంటాం.



*– ప్రభాకర్, రైతు, గుంజోట్టి, న్యాల్‌కల్ మండలం*




ఎకరం పారకానికి ఎన్ని గంటల కరెంటు కావాలో తెల్వనోళ్లకా?

**నీ ఓటు ఎవరికి?**

**తెలంగాణమా తేల్చుకో**